

## 1,200 మందికి వైద్య సేవలు

చాగల్లు : నేలటూరులో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 1,200 మందికి వైద్యసేవలు అందించారు. ఎన్‌టిఆర్ ట్రస్ట్, కోడూరి సుబ్బారావు, రామకృష్ణ జ్ఞాపకార్థం కోడూరి శ్రీనివాస్ సహకారంతో లయన్స్ క్లబ్ ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించింది. రాజమహేంద్రవరానికి చెందిన జిఎస్‌ఎల్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొని వైద్యసేవలు అందించారు. ఎన్‌టిఆర్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తొలుత ఎన్‌టిఆర్ విగ్రహానికి మాజీ మంత్రి కెఎస్.జవహర్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జె.చౌదరి, కోడూరి ప్రసాద్, కరుటూరి సతీష్, వేగి చిన్ని, చాగల్లు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పిచ్చుకల సత్తులు, మదర్ థెరిసా ఫౌండేషన్ సభ్యులు పోలిశెట్టి శ్రీనివాస్, బిసి నాయకులు శ్రీనివాస్, పొట్రు సిద్ధు, పొట్రు కృష్ణమోహన్, తాళ్లూరి ప్రసాద్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# సమిధలవుతున్న కార్మికులు

### సత్యనారాయణ ఆత్మహత్యతో కలకలం
### అక్రమాలపై ఉదాసీనంగా ఆంధ్ర పేపర్‌మిల్లు యాజమాన్యం
### చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఆంధ్రపేపర్ మిల్లులో అక్రమాల 'పరంపర' కారణంగా ఆర్థిక ఇబ్బందులకు గురై కార్మికులు సమిధలవుతున్నారు. కార్మిక సంఘం నాయకుని ముసుగులో ఓ వ్యక్తి యాజమాన్య ప్రతినిధితో కుమ్మక్కై 'పరంపర-2' స్కీం పేరుతో అక్రమాలకు తెర లేపారని కార్మిక సంఘాలు చెబుతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో మిల్లులోని 8 కార్మికసంఘాలు ఏకతాటిపైకి వచ్చి జనవరి 10 నుంచి దశలవారీ ఆందోళనలు చేపట్టాయి. ఇందులో భాగంగా పేపరు మిల్లు గేటు ఎదుట రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తున్నారు. పరంపర-2 ఆర్థిక లావాదేవీలు యూనియన్ నాయకుని ముసుగులో ఉన్న ఒక వ్యక్తి ద్వారానే సాగినట్లు తెలుస్తోంది. అయితే పరంపర స్కామ్ ఆ నోట..ఈ నోట బయటకు పొక్కడంతో ఉద్యోగుల అమ్మకాల వ్యవహారం నిలిచిపోయింది. అప్పటికే నగదు చెల్లించిన వారు ఆర్థికంగా నష్టపోయారు. ఈ అక్రమ దందాపై బహిరంగంగా ఫిర్యాదు చేయలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. తాజాగా సంగీత సత్యనారాయణ ఆత్మహత్యతో అక్రమాల పరంపర మరోసారి చర్చనీయాంశమైంది. ఇప్పటికైనా అధికార యంత్రాంగం, పేపరు మిల్లు యాజమాన్యం స్పందించి బాధితులకు అండగా నిలిచి అక్రమాలకు పాల్పడిన వారిపై ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

2017 ఎన్నికల్లో గుర్తింపు సంఘంగా గెలిచిన పేపర్ మిల్ కార్మిక సంఘం ప్రతినిధి ఒకరు, మిల్లు యాజమాన్య ప్రతినిధి కలిసి అక్రమాలకు తెరలేపారని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. 2019లో అప్పటి గుర్తింపు సంఘంతో జరిగిన 12(3) ఒప్పందంలో కాంట్రాక్టు కార్మికులను 54 మందిని సీనియారిటీ ఆధారంగా ఇన్ ప్లాంట్ ట్రైనీలుగా తీసుకోవడానికి, అదే విధంగా 55 మందిని బదిలీలుగా తీసుకోవడానికి, కోర్ విభాగాల్లో 55 ఖాళీలను కాంట్రాక్టు కార్మికులతో భర్తీ చేయడానికి ఒప్పందం జరిగింది. గత గుర్తింపు సంఘం కాలపరిమితి 2019లో ముగిసింది. దీంతో కార్మిక శాఖ 2020 జనవరి, ఫిబ్రవరిలో ఎన్నికల నిర్వహణ కోసం ప్రక్రియ ప్రారంభించింది. ఓటర్ల జాబితా కూడా ఇచ్చింది. ఈ లోగా కోవిడ్ వ్యాప్తిని సాకుగా చూపి గత గుర్తింపు సంఘం ప్రతినిధి ఎన్నికలు జరగకుండా హై కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు కార్మిక శాఖను, యాజమాన్యాన్ని కౌంటర్ దాఖలు చేయమని కోరింది. కాని ఎక్కడ ఎన్నికల ప్రక్రియ నిలుపుదలకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదు. కాని కోర్ట్ అనే సాకు చూపి మూడేళ్లుగా ఎన్నికలు నిర్వహించడంలేదు. ఈ కాలంలో పరంపర పథకాన్ని తీసుకొచ్చారు. ఏడాది, రెండేళ్ల సర్వీసు ఉన్న పర్మినెంట్ కార్మికులను దాదాపు 60 మందిని రాజీనామా చేయాలని, అలా చేస్తే వారి కుమారుడు లేదా అల్లుడికి ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పుకొచ్చారు. ఈ పథకం ద్వారా అక్రమ వసూళ్లకు పాల్పడ్డారనే విమర్శలు విన్పించాయి. పరంపర-2లో కార్మికుల పిల్లలు అనే విధానం కూడా పక్కకి పోయి బయటివారికి ఉద్యోగాలు అమ్మకం పెట్టేశారు. ఒక్కొక్క పోస్టు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల చొప్పున విక్రయించారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఉద్యోగులు రాజీనామా చేస్తే తాము వదులుకున్న సర్వీస్ కాలానికి యాజమాన్యం ఎలాంటి పరిహారం ఇవ్వడం లేదు. దాదాపు 150 పోస్టులు అమ్మేసినట్లు ప్రచారం జరుగుతోంది.



సత్యనారాయణ మృతదేహానికి నివాళులర్పిస్తున్న అరుణ్, రాజా తదితరులు

**ఉదాసీనంగా యాజమాన్యం**

పరంపర-2 స్కీం పేరుతో అక్రమాలు జరిగాయని కార్మికులు వివిధ రూపాల్లో నిరసనలు తెలిపినా యాజమాన్యం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. సాధారణంగా ప్రతి రెండేళ్లకు ఒకసారి పరిశ్రమలో ఎన్నికలు జరుగుతాయి. గుర్తింపు సంఘం యాజమాన్యంతో వేతన ఒప్పందం పైన, ఇతర సమస్యల చర్చలు జరుపుతుంది. వేతన ఒప్పందం ప్రతి మూడున్నరేళ్లకు ఒకసారి జరుగుతుంది. మూడేళ్లుగా ఎన్నికలు జరగకపోవడంతో పర్మినెంట్ కార్మికుల నూతన వేతన ఒప్పందం కూడా పెండింగ్‌లోనే ఉండిపోయింది. పాత వేతన ఒప్పందం 2020 జూన్‌తో పూర్తయ్యింది. దాదాపు 32 నెలలు గడిచిపోయినా కొత్త వేతన ఒప్పందం జరగలేదు. దీంతో ఒక్కో కార్మికుడు నెలకు రూ.11వేల చొప్పున 700 మంది నెలకు రూ.77 లక్షలు, 32 నెల్లో రూ.24.64 కోట్లు నష్టపోయారు. అధికార యంత్రాంగం చొరవ తీసుకుని తమకు న్యాయం చేయాలని కార్మికులు కోరుతున్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

# అంబానీ, అదానీల కోసమే మోడీ పాలన

### 'చలో ఢిల్లీ' పోస్టర్ ఆవిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అంబానీ, అదానీల కోసమే మోదీ పాలను సాగుతుందని, వారి నుంచి దేశ ప్రజలను కాపాడేందుకే 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పలువురు వక్తలు అన్నారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధిచిన పోస్టర్‌ను స్థానిక శ్యామల సెంటర్‌లో సిఐటియు జిల్లా నాయకులు ఆవిష్కరించారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకొచ్చింది మొదలు కార్మిక, రైతు, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్మికులకు తీవ్ర ద్రోహం చేసిందన్నారు. మోడీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగం తీవ్ర స్థాయికి చేరిందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోదీ ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రజల సంపదను విదేశీ, స్వదేశీ సంస్థలకు అప్పగించి నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తుందన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లుకు అప్పగించేందుకు భారత వ్యవసాయ చట్టాలకు సవరణలు చేసిందన్నారు. రైతాంగం పోరాటంతో వెనక్కి తగ్గిందన్నారు. మోదీ పాలనలో రికార్డు స్థాయిలో ధరలు పెరిగాయన్నారు. రూ.400 ఉన్న గ్యాస్ బండ రూ.1,200కి చేరిందనానరు. రూ.55 ఉండే లీటర్ పెట్రోల్ నేడు రూ.110 దాటిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు సామాన్య ప్రజలకు అందుబాటులో లేవన్నారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న వినాశనకర విధానాలకు నిరసనగా సిఐటియు, రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల 'చలో ఢిల్లీ'కి పిలుపునిచ్చాయన్నారు. దీన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కనీస వేతన రూ.26వేలు, కనీస పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందని పర్మినెంట్ చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, ఉపాధి హామీ పనికి కనీస వేతనం రూ.600 ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలనే డిమాండ్లతో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎస్.మూర్తి, కె.రామకృష్ణ, జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమరాజు, రైతు సంఘం నాయకులు పడాల రామకృష్ణ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, సిఐటియు నాయకులు అప్పల నరసయ్య, సోమేశ్వరరావు, లవకుమార్, జి.తాతారావు తదితరులు పాల్గొన్నారు.

# నేలకొరిగిన మొక్కజొన్న

ప్రజాశక్తి - గోపాలపురం

గాలివానకు మొక్కజొన్న పంట నేలకొరిగింది. మండలంలోని ఆదివారం ఈదురుగాలులతో కూడి భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి మండలంలోని భీమోలులో ఇల్లు బోయిన శ్రీను, దుంపల రాంపండు, కోడి రామకృష్ణ, వింటి మురళి తదితర రైతులకు చెందిన సుమారు 200 ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగింది. ప్రస్తుతం పంట పాలు పోసుకుని కండి తయారీ దశలో ఉంది. ఈ సమయంలో ఈదురుగాలులు, వర్షం రావడంతో పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. నేలకొరిగిన చేలల్లో 50శాతానికిపైగా పంట పాడవుతుందని రైతులు చెబుతున్నారు. మిగిలిన గ్రామాల్లో పంట నష్టం తెలియాల్సి ఉంది. అలాగే అకాల వర్షంతో ఇటుక బట్టీల వ్యాపారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పచ్చి ఇటుకలను కాపాడుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. మరోపక్క పొగాకు రైతులు పంటను కాపాడుకునేందుకు నానా తంటాఉ పడుతున్నారు. మామిడి తోటలు ప్రస్తుతం పిందెల దశలో ఉన్నాయి. వర్షంతో దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని మామిడిరైతులు ఆందోళన చెందుతున్నారు.



నేలవాలిన మొక్కజొన్న చేను

# వైసిపి హయాంలో సొంతింటి కల సాకారం

ప్రజాశక్తి - పెరవలి

పేదల సొంతింటి కలను వైసిపి ప్రభుత్వం నిజం చేస్తుందని ఎంఎల్ఎ జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. ఆదివారం మల్లేశ్వరం గ్రామంలో గృహ లబ్ధిదారులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణం చేసుకునేందుకు వీలుగా జగనన్న లే అవుట్‌ను సిద్ధం చేసి అందించామన్నారు. ప్రభుత్వం తరపున సిమెంట్, ఇసుక, ఐరన్ వంటివి ప్రభుత్వమే అందిస్తుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు ఇళ్లను త్వరితగతిన నిర్మించుకోవాలన్నారు. ఇంటి నిర్మాణం పూర్తయ్యే వరకు లబ్ధిదారులకు అండగా ఉంటామన్నారు. అనంతరం గ్రామంలో ఇటీవల ప్రమాదవస్తు గాయపడిన పార్టీ కార్యకర్తలు దేవరపల్లి గణేష్, మైగపుల హేమంత్‌ను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె..సీతారాంప్రసాద్, వైస్ ఎంపిపి వేంద్ర శ్రీనివాస్, సర్పంచ్ బొలిశెట్టి రత్నమాల, నాయకులు బొలిశెట్టి పట్టాభి రామారావు, హౌసింగ్ ఎఇ ఎలిపే వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ శ్రీనివాస్‌నాయుడు



దాతలతో విద్యార్థులు

## పట్టుదలతో చదవాలి

ప్రజాశక్తి - గోపాలపురం

విద్యార్థులు పట్టుదలతో చదవి మంచి మార్కులు సాధించాలని గోపాలపురం సొసైటీ అధ్యక్షులు కూసం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 160 మంది పదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని ఆయన అందించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి, మానవతా సంస్థ మండల చైర్మన్ జొన్నగడ్డల రాంబాబు మాట్లాడారు. ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, అనుదీప్, చంద్రశేఖర్, వాసు, మురళి, కపావర ప్రసాద్, వెంకటరమణ హెచ్ఎం సోమశేఖర్ పాల్గొన్నారు. అలాగే గోపాలపురం ఉప్పరగూడెంలో 30 మంది పదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని కలపాల శేషు సౌజన్యంతో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు చదువు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ పెనుమాక అనిల్‌కృష్ణ, న్యాయవాది జానపాటి చంద్రశేఖర్, గ్రామ పెద్దలు కొడవటి గంగరాజు, కె.ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా...

## ఉపాధ్యాయుల ముమ్మర కసరత్తు
## పది పరీక్షలకు విద్యార్థులు సమాయత్తం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా విద్యాశాఖ, ఉపాధ్యాయులు చేసిన కసరత్తు మంచి ఫలితాలు వస్తాయనే ఆశాభావం వ్యక్తమవుతోంది. కరోనా వైరస్ విజృంభణ కారణంగా మూడేళ్లుగా విద్యా వ్యవస్థ అనేక ఒడిదుడుకులకు గురైంది. దీంతో జిల్లాలో ఉత్తమ పాఠశాలలు సైతం ఫలితాల్లో వెనుకబడ్డాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు విద్యాశాఖ అధికారుల ఆదేశాలతో జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. విద్యార్థుల సామర్థ్యం ఆధారంగా ఎ,బి,సి,డిలుగా విభజించారు. అనంతరం వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత (కేటాయింపు) తీసుకున్నారు. విద్యార్థులు వెనుకబడిన అంశాలలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వాట్సప్ గ్రూపుల ద్వారా టీచింగ్ వీడియోస్, లెర్నింగ్ టెక్నిక్స్‌ను విద్యార్థులకు అందజేశారు. విద్యార్థుల సందేహాల నివృత్తికి తరగతి గదికే పరిమితం కాకుండా ఫోన్ కాల్‌కు అందుబాటులో ఉంటూ బోధించారు.

### యుటిఎఫ్ మెటీరియల్ తోడ్పాటు



రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన ఆల్ ఇన్ వన్, యుటిఎఫ్ వారు అందజేసిన మెటీరియల్‌లలో ప్రీవియస్ పేపర్లుతో పాటు, ప్రాక్టీస్ పేపర్లను రాశాము. పబ్లిక్ పరీక్షలకు సంసిద్ధమయ్యేందుకు తోడ్పాటు లబించింది. పాఠశాలలో తరగతులకు హాజరయ్యే ముందు 2 గంటలు, స్కూలు నుంచి ఇంటికి వెళ్లిన అనంతరం మరో 2 గంటలు చొప్పున చదివాం. ఉపాధ్యాయులు విద్యార్థులను దత్తత తీసుకుని చదివించారు.

**- పి.సమీర, పదో తరగతి విద్యార్థిని, ఎస్‌కెవిటి**

### రన్నింగ్ నోట్స్‌పై దృష్టి పెట్టాలి



గతేడాది వరకు సైన్స్ పరీక్షకు రెండు పేపర్లు ఉండేవి. ఈ ఏడాది మాత్రం ఒకే పేపర్. మొదటి గంటన్నర ఫిజికల్ సైన్స్‌కు, చివరి గంటన్నర బయలాజికల్ సైన్స్‌కు విభజిస్తారు. ప్రశ్నాపత్రం మాత్రం ఒకటే. పాఠ్యాంశాలను బోధించినప్పుడే విద్యార్థులు రాసిన రన్నింగ్ నోట్సు ఒకటికి రెండు సార్లు పరిశీలించాలి. పాఠ్య పుస్తకంపై పూర్తి శ్రద్ధ చూపితే మంచి మార్కులు సాధించడం సులువు. ప్రయోగాలు, భావన, విశ్లేషణపై 1, 2 మార్కుల ప్రశ్నలు ఉంటాయి. అలాగే ప్రశ్నాపత్రంలో ఇచ్చిన చిత్రాన్ని గుర్తించి విశ్లేషించి సమాధానాలు రాయాలి. శాస్త్రవేత్తలు, పరిశోధనలను బాగా చదవాలి. ఈ సబ్జెక్ట్‌లో 13 మంది శాస్త్రవేత్తల గురించి చదివితే ఇద్దరు శాస్త్రవేత్తలు గురించి ప్రశ్నలు వస్తాయి. ముఖ్యంగా సైన్స్ పేపర్‌లో మొదటి 16 ప్రశ్నలు ఫిజికల్, 17 నుంచి 33 ప్రశ్నలు బయలాజికల్ సైన్స్‌పై ప్రశ్నలు ఉంటాయి.

**-బిబి.విజయకుమారి బయలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులు**

### ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో...



ఉపాధ్యాయులు విద్యార్థులకు వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేశారు. పాఠశాల తరగతులు పూర్తయిన అనంతరమూ మాకు ఏమైనా సందేహాలు ఉంటే ఫోన్ కాల్ ద్వారా మాట్లాడి తెలుసుకుంటున్నాం. ఇంగ్లీష్‌లో కాంప్రెహెన్సివ్ (పాసేజ్‌లు)ను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలని తెలిపారు. అప్లికేషన్ మెథడ్‌లో ఉండే ప్రశ్నలను ఒకటికి రెండుసార్లు చదివాం. కియేటివ్ రైటింగ్(సజనాత్మకత) రాసేటప్పుడు కాన్వర్జేషన్, లెటర్ రైటింగ్ పలు మార్లు ప్రాక్టీస్ అయ్యాము. మిగిలిన సబ్జెక్టులను ప్రణాళికా బద్ధంగా చదివాము.

**-కె.భాగ్యశ్రీ పదో తరగతి విద్యార్థిని ఎస్‌కెవిటి**

### ఉదయం 4 గంటల నుంచే దినచర్య



వేకువజామున 4 గంటలకు నిద్రలేవటం దినచర్యలో భాగమైంది. ప్రతి రోజూ నిర్వహించిన డైలీ టెస్టులు, వీక్లి టెస్టుల నిర్వహణతో పరీక్షలపై కొంత మేర భయం పోయింది. ప్రతి సబ్జెక్టులోనూ ఇంపార్టెంట్ నోట్సు రాసుకుని రివిజన్ చేశాను. ఫిజికల్ సైన్స్‌లో రసాయన ప్రయోగాల్లో వచ్చే వాయువులు, వక్రీభవన వేగం పట్టిక ఆధారంగా సమాధానాలు వంటివి చదివాము. డయాగ్రమ్‌లు ప్రాక్టీస్ చేశాము. ప్రమాణాలు తప్పులు రాకుండా అధ్యయనం చేశాము. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

**- వై.దీపిక, పదో తరగతి విద్యార్థిని, ఎస్‌కెవిటి**

### ప్రణాళికా బద్ధంగా పరీక్షలకు



పదో తరగతి విద్యార్థులను ప్రణాళిక బద్ధంగా పరీక్షలకు సిద్ధం చేశాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. పబ్లిక్ పరీక్షలు కావడంతో పరీక్షలు సమీపిస్తున్న కొద్దీ విద్యార్థులు ఒత్తిడికి గురవుతుంటారు. దీనివల్ల ప్రయోజనం ఉండదు. ప్రణాళికాబద్ధంగా చదవాలి. కొంతమంది రాత్రంతా మెలకువగా ఉండి చదివేందుకు ప్రయత్నిస్తారు. దీని వల్ల ఆరోగ్య సమస్యలు వస్తుంటాయి. తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకవాలి. పిల్లల పక్కన కూర్చుని చదివించాలి. పరీక్షలంటే ఓ రకమైన ఫోబియోతో కొంతమంది జ్వరం తెచ్చుకోవడమో, అనారోగ్యానికి గురవుతుంటారు. ఎలాంటి ఆందోళన లేకుండా ప్రశాంతంగా పరీక్షలకు సిద్ధమవ్వాలి. మానసిక సంసిద్ధతతోనే సత్ఫలితాలు సాధించగలం.

**- ఎంవిఎం.సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు, ఎస్‌కెవిటి హై స్కూలు**

### డైలీ, వీక్లీ టెస్టులతో సంసిద్ధం



డైలీ, వీక్లీ టెస్టుల వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం ఉంది. ప్రతిరోజూ ఈ టెస్ట్‌లు జరుగుతుంటే.. ఆరు రోజుల్లో రెండు ఛాప్టర్లు పూర్తవుతాయి. ఏడో రోజున ఆ రెండు ఛాప్టర్‌లపై మరోసారి పరీక్ష నిర్వహిస్తారు. దీనివల్ల గణితంలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. గతంలో ఇచ్చే అర మార్కు బిట్‌లకు ఒక మార్కు ఇవ్వడం వల్ల విద్యార్థులు 12 మార్కులను స్కోరు చేసే వీలుంది. వత్తాలు, త్రిభుజాలు, స్పర్శ రేఖలపై 8 మార్కుల ప్రశ్నలు ఉంటాయి. వాస్తవ సంఖ్యల ఛాప్టర్ ద్వారా 8 మార్కులను సులువుగా సాధించవచ్చు. గ్రాఫ్ పేపర్‌లో మూలాలు కనుగొనుట ద్వారా 8 మార్కులు పొందొచ్చు. గణితంలో ఏమైనా సందేహాలుంటే ముందుగా నివత్తి చేసుకోవాలి. పరీక్షా కేంద్రంలో తొలుత ప్రశ్నాపత్రాన్ని విద్యార్థులు క్షుణ్ణంగా చదవాలి. జవాబు రాసిన అనంతరం మరో సారి చెక్ చేసుకోవాలి.

**- పి.లతాపూర్ణిమ గణితం ఉపాధ్యాయుల**

## కార్టూ'నిజం'




టిక్కెట్ కోసం జనంలోకి వెళ్లారు...
ఫలితం ఇదీ...!!!

## ఘనంగా మట్టల ఆదివారం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం, నిడదవోలు, గోకవరం

మండలంలో క్రైస్తవులకు మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. చివటం జీసస్ క్రైస్ట్ మినిస్ట్రీస్ దైవ సేవకులు డాక్టర్ రెవరెండ్ తరపట్ల అబ్బులు, లివింగ్ గాడ్ బెరాకా మినిస్ట్రిస్ సండే స్కూల్, జీసస్ క్రైస్ట్ మినిస్ట్రీస్, కల్వరి మినిస్ట్రీస్ చిన్నారులు ఈత మట్టలను చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. నిడదవోలులోని ఆర్‌సిఎం చర్చిలో మట్ల ఆదివారం పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ఈత మట్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ బాలస్వామి తదితరులు పాల్గొన్నారు. గోకవరం మండలంలోని రంప ఎర్రంపాలెంలో బెతస్థ ప్రేయర్ హోమ్‌లో మట్టల ఆదివారం నిర్వహించారు ఈ సందర్భంగా పాస్టర్ జి.మనోహర్ మాట్లాడారు.



నిడదవోలులో క్రైస్తవుల ర్యాలీ



నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చియ్యచౌదరి

## సూర్యప్రకాష్‌కు గోరంట్ల నివాళి

ప్రజాశక్తి- కడియం

మండలంలోని మాధవరాయుడు పాలేనికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు, ప్రముఖ రైతు అన్నందేవుల సూర్యప్రకాష్‌కు రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చియ్యచౌదరి ఘనంగా నివాళులర్పించారు. సూర్యప్రకాష్ ఆదివారం ఉదయం గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారు. విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ గోరంట్ల మాధవరాయుడు పాలెం చేరుకొని సూర్యప్రకాష్ మతదేహాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే సర్పంచ్ అన్నందేవుల చంటి, టిడిపి మండల అధ్యక్షులు వెలుగుబంటి నాని, నాయకులు అన్నందేవుల సుబ్బారాయుడు, అన్నందేవుల వీరాస్వామి, సంగీత వెంకటేశ్వరరావు, అన్నందేవుల నారాయణరావు, సుధాకరరావు, సురేష్, బాబి తదితరులు నివాళు లర్పించారు.

## ఘనంగా 'ఆదర్శ' వార్షికోత్సవం

ప్రజాశక్తి- గోకవరం

మండలంలోని కొత్త పల్లిలో ఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, ఆదర్శ పబ్లిక్ హై స్కూల్లో 20వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆదర్శ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ చైర్మన్ ప్రగళ్లపాటి కనకరాజు, సెక్రటరీ నాగమణి హాజరయ్యారు. విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం ప్రతిభను కనబర్చిన విద్యార్థులు బహుమతులు, మెడల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ త్రినాథరావు, హెచ్ఎం సత్యనారాయణ, కో-ఆర్డినేటర్ పి.శ్రీనివాస్, కామేష్, డాక్టర్ కిరణ్, ప్రేమ్, సంకీర్తన, మౌనిక, పద్మ హేమలత పాల్గొన్నారు.



విద్యార్థులతో కనకరాజు

## 'సాయిశ్రీ' ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసి సాయిశ్రీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆదివారం ప్రారంభమైంది. గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు ఈ ఆసుపత్రిని ప్రారం భించారు. ఆయన మాట్లాడుతూ దేవరపల్లి గ్రామంలో అందరికీ అందుబాటులో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని తీసుకురావడం అభినందనీయమన్నారు. దేవరపల్లి చుట్టుపక్కల గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని యాజమాన్యానికి సూచించారు.



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ తలారి

## పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - తాళ్లపూడి

పదో తరగతి పరీక్షలకు మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఇఒ వివేకానంద తెలిపారు. మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 778 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. తాళ్లపూడి శ్రీ పరస పద్మ రాజారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 192 మంది, వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 268 మంది, మలకపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 318 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. ఈ పరీక్షల నిర్వహణ కోసం ముగ్గురు డిపార్ట్‌మెంట్ అధికారులు, 38 మంది ఇన్విజిలేటర్లు, మరో ముగ్గురు రిజర్వులో నియమించామన్నారు.

# పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు




## కాకినాడ డిఇఒ అన్నపూర్ణ



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

**సోమవారం నుంచి 18వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలకు పగడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు కెఎన్‌విఎస్ అన్నపూర్ణ చెప్పారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా వివిధ శాఖల సమన్వయంతో ఇప్పటికే అన్ని సదుపాయాలు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతి కేంద్రంలోనూ గాలి, వెలుతురు వచ్చేలా ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా మంచినీటి సదుపాయం, మరుగుదొడ్లు అందుబాటులో ఉండాలని సూచించామన్నారు.**

**ఎంతమంది పరీక్షలు రాయనున్నారు.?**

ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 నిమిషాల వరకు ప్రతిరోజు జరుగుతున్న పరీక్షలను 136 కేంద్రాలకు 29,988 మంది హాజరు కానున్నారు. వీరిలో రెగ్యులర్‌గా బాలురు 13,647, బాలికలు 13,820 మంది ఉన్నారు. తెలుగు మీడియంలో 8,785 మంది, ఇంగ్లీషు మీడియంలో 18,682 మంది ఉన్నారు. ప్రైవేటుగా 1,499 మంది బాలురు, 971 బాలికలు ఉన్నారు.

**సమస్యాత్మక కేంద్రాల్లో ఎటువంటి ఏర్పాటు చేస్తున్నారు.?**

జిల్లాలో దానవాయిపేట, పెరుమాళ్లపురం, కోటనందూరు, రౌతులపూడి జిల్లా పరిషత్ హైస్కూల్స్ అతి సమస్యాత్మక కేంద్రాలుగా ఉన్నాయి. వీటిలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం ప్రైవేటు పరీక్షా సెంటర్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించాం. పరీక్షల్లో విధులు నిర్వ హించే పరిశీలకులకు, డిపార్ట్మెంట్ అధికారులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చాం. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.

**ఈసారి పరీక్ష విధానంలో ఎటువంటి మార్పులు వచ్చాయి.?**

గత పరీక్షల్లా ఈసారి 11 ప్రశ్నపత్రాలు ఉండవు. విద్యాశాఖ వాటిని కుదించి 6 ప్రశ్నపత్రాలుగా మార్పు చేసింది. సైన్సుకు సంబంధించి జీవ, రసాయన, భౌతికశాస్త్రాలను ఒకే పరీక్షగా నిర్వహిస్తారు. ఒక్కో విద్యార్థికి ముందుగా 24 పేజీలుండే జవాబు పత్రం ఇస్తారు. విద్యార్థులు అదనంగా కావాలనుకుంటే మరొక 12 పేజీలు గల జవాబు పత్రం ఇస్తారు.

**మాల్ ప్రాక్టీస్ నివారణకు ఏమి చర్యలు తీసుకుంటున్నారు.?**

జవాబు పత్రాలపై క్రమసంఖ్య ఉంటుంది. దీంతో ఒక విద్యార్థి పత్రాలు మరొక విద్యార్థి దగ్గర ఉంటే సులభంగా గుర్తించడానికి వీలుంటుంది. ముఖ్యంగా ప్రతి ప్రశ్నపత్రంపై ఒక యూనిక్ సంఖ్య ఉంటుంది. ఒకవేళ ఏదైనా ప్రశ్న పత్రం బయటకు వచ్చినా అది ఎక్కడ నుంచి వచ్చిందో సులువుగా గుర్తిస్తాము.

**ఎటువంటి జాగ్రత్తలు వహించేలా చర్యలు చేపట్టారు.?**

పరీక్షా కేంద్రాల వద్ద 100 మీటర్ల లోపు జిరాక్సు సెంటర్లు, సెల్ ఫోన్ దుకాణాలు తెరచి ఉంచకుండా చర్యలు తీసుకున్నాం. పరీక్ష కేంద్రాలన్నింటిని 'నో సెల్ఫోన్' జోన్లుగా ప్రకటించారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరు. విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి కనీసం అరగంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలి. కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు వీలుగా బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు.

# ప్రణాళికతో చదివితే 'పది' జిపిఎ

**సబ్జెక్టుల వారీగా అవగాహన అవసరం**

**విద్యార్థులకు విషయ నిపుణుల సూచనలు, సలహాలు**

ప్రజాశక్తి-రాజోలు

ప్రణాళికతో చదివితే టెన్త్ పరీక్షల్లో మంచి మారులు సాధించవచ్చు. ఈ నెల 3వ తేదీ నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు మొదలుకానున్న నేపథ్యంలో ఏయే విషయాలపై దష్టి సారించాలనే విషయాలపై సబ్జెక్టుల వారీగా నిపుణులు తమ సలహాలు అందజేశారు. పది జిపిఎ ఎలా సాధించవచ్చనే అంశంపై పలువురు ఉపాధ్యాయులు సూచనలిస్తున్నారు.

## వ్యాసరూప ప్రశ్నలపై పట్టు ఉండాలి



తెలుగులో 80 మారులకు 20 మార్కులు అవగాహన, ప్రతిస్పందన నుంచి పొందొచ్చు. దానశీలం, భిక్షపాతాల నుంచి చుక్క గుర్తు పద్యాల్లో ఒకటి అడిగే అవకాశముంది. ఆధునిక పద్య పాఠాలు, వీర తెలంగాణ, శతక పద్యాల నుంచి ఒకటి వస్తుంది. అపరిచిత గద్యం ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు ఉన్నందున అర్థం చేసుకొని 1 లేదా 2 మాటల్లో జవాబు రాయాలి. స్వీయరచన, సజనాత్మకత, వ్యక్తీకరణ చిన్న ప్రశ్నల్లో ఒక కవి పరిచయం అడుగుతారు. ఇదే విభాగంలో ఏదైనా ఒక శతక సారాంశం లేదా భావం ప్రశ్న అడుగుతారు. వ్యాసరూప ప్రశ్నలకు రామాయణంపై పట్టు ఉంటే మంచి మారులు సాధించొచ్చు.

**-దేవరకొండ శ్రీనివాస్ వెంకటరమణారావు, తెలుగు ఉపాధ్యాయులు**

## ప్రణాళికే ప్రధానం



ఫిజిక్స్, బయోలజీ కలిపి ఒకే రోజు పరీక్ష రాయాల్సి ఉన్నందున ముఖ్యమైన విషయాలు గుర్తు పెట్టుకుంటే మంచి మారులు సాధించవచ్చు. ప్రయోగాలకు తొమ్మిది మారులు కేటాయించారు. 2 మార్కుల ప్రశ్నలుగా.. ప్రయో గ సామగ్రి పరిశీలన, ఫలితాల్లో ఒకటి అడు గుతారు. ఆరు మారుల ప్రశ్నల్లో ఒక ప్రయోగ విధానం తప్పనిసరిగా వస్తుంది. విషయ అవగాహనలో 18 మారులకు వచ్చే ప్రశ్నల్లో బ్లీచిం గ్ పౌడర్, వాషింగ్ సోడా ఉపయోగాలు, కుంభాకార, పుటాకార దర్ప ణాల బేధాలు, ఆవర్తన పట్టిక లక్షణాలు వంటివి చదవాలి.

**-పితాని వెంకటేశ్వరరావు, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు**


## లెక్కలంటే భయమెందుకు..



మంచి మారుల కోసం 14 చాప్టర్లపై పట్టు సాధించాలి. ప్రభుత్వం ఇచ్చిన అభ్యాసదీపిక లోని నమూనా ప్రశ్నలు సాధన చేస్తే మంచి మారులు పొందవచ్చు. గ్రాఫ్ సమస్యలు సాధించేటప్పుడు తప్పక సేల్, సాధన రాయాలి. నిర్మాణ పటం గీసేటప్పుడు నిర్మాణ క్రమం, నిర్ధారణ కూడా రాయా లి. వాస్తవ సంఖ్యల్లో లాగరిథమ్స్, సమితులలో వెన్ చిత్రాలు, సెట్ బిల్డర్ సామ్, రోస్టర్ ఫామ్ రాయడం, బహుపదుల్లో పరావలయం గీయడం, సంభావ్యత, సంఖ్యాక శాస్త్రంలో మీన్, మీడియన్, మోడ్ లెక్కలతోపాటు ఓజివ్ గ్రాఫ్‌లే కాక, సరూప త్రిభుజ నిర్మాణాలు, వత్తానికి స్పర్శరేఖలు గీయడం త్రికోణమితి అనువర్తనాలు నుంచి బొమ్మ గీయడం ప్రాక్టీస్ చేయాలి.

**-ఎవి.రాఘవేంద్రరావు,గణితఉపాధ్యాయులు,శివకోడు**

## హిందీపై పట్టు సాధించాలి



హిందీపై పట్టు సాధించి, భాషా జ్ఞానాన్ని పెంచుకుంటే అపజయం ఉండదు. పఠిత గద్యాంశం పుస్తకంలో నాలుగు ఉప వాచక పాఠాల నుంచే ప్రశ్నలు అడుగు తారు. పఠిత పద్య 1,2,4(బరసతే బాదల్, మా ముఝే అనేదే, కణ్‌కణ్‌కా అధికారి) పాఠశాల నుంచి ఒక పద్యం ఇచ్చి ఐదు ప్రశ్నలు వేస్తారు. పద్యాల భావం నేర్చుకుంటే మంచి మార్కులు వస్తాయి. రెండో విభాగం.. నాలుగు మార్కుల ప్రశ్నల్లో ఒకటిగా ఉండే కవి పరిచయం కోసం చరిత్రలు నేర్చుకోవాలి. 8 మార్కుల ప్రశ్నలు పద్యభాగం, గద్యభాగం నుంచి రెండేసి అడుగుతారు. అపఠిత గద్యం ప్రశ్నలకూ సులభంగా మార్కులు పొందవచ్చు.

**-బత్తుల వి.ఆనంద్‌కుమార్,అసిస్టెంట్ హిందీ, చింతపల్లి**

## బొమ్మలపై పట్టు ఉండాలి



సామాన్య శాస్త్రం రెండు పేపర్లుగా ఉంటుంది. పార్ట్-బీకి గంటన్నర సమయం ఉం డగా.. 40 మారుల ప్రశ్నాపత్రానికి సమాధానాలు రాయాలి. హైడ్రిల్లా ప్రయోగం, సీ 02 అవసరం. కిరణజన్య సంయోగ క్రియకు కాంతి అవసరం, శ్వాసక్రియలో సీ 02 ఉష్ణం విడుదలవుతోందని చూపే ప్రయోగాలు నేర్చుకుంటే ఎనిమిది మార్కులు సొంత మవుతాయి. ఇక మానవుని జీర్ణవ్యవస్థ, ఏక వలయ, ద్వివలయ రక్త ప్రసరణ మూత్రపిండాలు అంతర్నిర్మాణం బొమ్మలను నేర్చుకుంటే ఆరు మార్కులు సాధించొచ్చు.పర్యావరణ సంరక్షణపై పట్టు పెంచుకుంటే ఈ విభాగంలో 18 మార్కులు సాధించొచ్చు.

**-సిహెచ్.హరిచంద్రప్రసాద్, సైన్స్ ఉపాధ్యాయులు, తాటిపాక**

## ఆంగ్లం అంటే భయాన్ని వీడాలి



ఆంగ్లమనే భయం వీడితే మంచి మారులు సాధించవచ్చు. ప్రశ్నాపత్రంలో 1 నుంచి 4, 5 నుంచి 8 ప్రశ్నలు రీడింగ్ విభాగంలో పాఠ్యపుస్తకం నుంచి ఇచ్చే ప్యాసేజ్ చకగా చదివాక ప్రతి ప్రశ్నకు మూడు వ్యాక్యాల సమాధానం రాయాలి. why do you think ,what do you think, How would you respond, what would you you do వంటి ప్రశ్నలు అడిగితే if i were, .i would వంటి వ్యాక్యంతో సమాధానాలు మొదలుపెడితే మంచిది. పాఠ్యపుస్తకం క్షుణ్ణంగా చదివితే మంచి సమాధానాలు రాయచ్చు.

**-నల్లి విశ్వనాథ్, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు, అంతర్వేది పాలెం**

## అన్ని ప్రశ్నలకు ఒకేతీరు సమాధానాలు వద్దు



అన్ని ప్రశ్నలకు ఒకేతీరుగా కాకుండా అడిగిన విధానాన్ని బట్టి సమాధానం రాయాలి. వ్యాసరూప సమాధాన ప్రశ్నలకు కారణాలు, పోలికలు, బేధాలు, ఫలితాలు, ప్రభావితం చేసే అంశాలను వర్గీకరించడం, ఉదాహరణలతో వివరించాలి. పట్టికలు, గ్రాఫులు కచ్చితంగా అడిగే అవకాశం ఉంది. ఇచ్చిన డేటా ఆధారంగా విశ్లేషణ చేయడంతోపాటు కారణాలు, ఉదాహరణలు, ఫలితాలే కాకుండా సూచనలు, పరిష్కార మార్గాల వంటి వాటితో మంచి మార్కులు ఖాయం.

**-కట్టా జగన్‌మోహన్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, జిల్లా పరిషత్, రాజోలు**

# ఆకట్టుకున్న సైన్స్, మేజిక్ షోలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

కనికట్టు ద్వారా మాయ చేస్తున్న వారి వలలో పడకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు బివి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం సామర్లకోట మండలం మాధవపట్నం గ్రామం జమునానగర్ కాలనీలో అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వహిస్తున్న బాలమందిరంలో సైన్స్ షక్ష నిర్వహణ, మేజిక్‌షోలు కార్యక్రమాలు సైన్స్ షోలను బివి సత్యనారాయణ నిర్వహించారు. విద్యార్థులకు వాటిపై అవగాహన కల్పించారు. గ్రంథాలయంలో పుస్తక సమీక్షలు నిర్వహించి, పరీక్షలను విద్యార్థులు పండుగలా భావించి ఉత్సాహంగా పరీక్షలు రాసి విజయాలు సాధించాలని బాలమందిరం కన్వీనర్ కృష్ణశ్రీ పిలుపునిచ్చారు. భాషా నైపుణ్యాలు గతవారం భాషా నైపుణ్యాలు పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సత్యనారాయణ

## 99వ రోజు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

పి.వేమవరం గ్రామంలో 199వ రోజు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు పాల్గొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, వైసిపి మండల అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, వైసిపి నాయకుడు ఎలిశెట్టి నరేష్, మాజీ సర్పంచ్ ఎలిశెట్టి భీమన్న దొర, సొసైటీ అధ్యక్షులు ఊటా వాసు, అత్తిలి రాంబాబు పాల్గొన్నారు.

## వడ్లమూరులో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

**పెద్దాపురం :** మండలంలోని వడ్లమూరులో ఆదివారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని అన్ని వీధుల్లో పర్యటించారు. ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావటం ద్వారానే రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, పార్టీ మండల అధ్యక్షులు కొత్తిం వెంకట శ్రీనివాసరావు(కోటి), ఎలిశెట్టి నాని, బొడ్డు వెంకన్న, మొయిళ్ల కష్ణమూర్తి, నూనె రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా మట్టల ఆదివారం

**మట్టల ఆదివారం పర్వదినాన్ని ఘనంగా నిర్వహిరంచుకున్నారు.**

ప్రజాశక్తి - యంత్రాంగం

**పెద్దాపురం** పట్టణం, మండల పరిధిలో మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక స్వర్ణ దేవాలయం, డాక్టర్ ఇమ్మాన్యుయేల్ రాజు చర్చిలతోపాటు అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మట్టలతో ప్రజలు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. **గండేపల్లి** మండలంలో ఈస్టర్ ముందు వారం జరుపుకునే మట్ల ఆదివారంలో భాగంగా ఆయా గ్రామాల్లో ఉన్న చర్చిల్లో పిల్లలతో సహా ఘనంగా నిర్వహించారు. గండేపల్లి చర్చిలోనూ పిల్లలతో సహా ఈత కొమ్మల్లో పువ్వులు పెట్టి ర్యాలీ నిర్వహించారు. **సామర్లకోట** మండల పరిధిలో అన్ని క్రైస్తవ దేవాలయాల ఆధ్వర్యంలో సంఘ కాపరులు, పెద్దలు, యువజనులు, చిన్నారులు ఈత మట్టలను పూలతో అలంకరించి పురవీధులలో ప్రదర్శనలు చేపట్టారు. సెంటినరీ బాప్టిస్ట్ చర్చి, సెంటినరీ అగస్థానా లూథరన్ చర్చి, ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి, ట్రూ గాస్పెల్ చర్చి, షాలెం బాప్టిస్ట్ చర్చి, బేరాకా ప్రార్థన మందిరం, షారోన్ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యాన ర్యాలీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కిరణ్ బాబు, బి.కిరణ్ కుమార్, డాక్టర్ ఈలి సత్య సువార్త రాజు, వంకా జాన్, డాక్టర్ ఎంఎ.జేమ్స్ పాల్గొన్నారు.

## అభివృద్ధిపై ప్రజలే న్యాయ నిర్ణేతలు

ప్రజాశక్తి-మండపేట

మండపేటను అభివృద్ధి చేసింది ఎవరో అందరికి తెలుసని ప్రజలే న్యాయ నిర్ణేతలని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక కపిలేశ్వరపురం రోడ్డులోని ఆయన నివాసం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పటి కౌన్సిల్ తీర్మానం, అన్ని సంఘాల ఆమోదంతో స్థానిక కలువ పువ్వు సెంటర్లో తన తండ్రి వేగుళ్ళ వీర్రాజు విగ్రహం ఏర్పాటు చేశారన్నారు. తను అప్పటికి రాజకీయాల్లో లేనన్నారు. నియోజకవర్గంలోని 2308 పేద గహనిర్మాణదారుల బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో చెప్పమంటే ఏదేదో మాట్లాడుతూ అసలు విషయం పక్కదారి పట్టిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, వాదా ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి రూ.10 వేలు అందజేత

ప్రజాశక్తి-రామచంద్రపురం

కాపవరం గ్రామానికి చెందిన కొండాయపాలెపు వీరబాబు (30) ప్రమాదవశాత్తు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు మతునికి భార్య, 3నెలల పాప ఉన్నారు. కుటుంబానికి వైయస్ఆర్ బీమా రూ.5లక్షల ఇన్సూరెన్స్ మంజూరైంది. తక్షణ సాయంగా రూ.10 వేలు నామినీ తల్లి కొండాయపాలెపు లక్ష్మికి మంత్రి తనయుడు నరేన్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో గుబ్బల ఏసురాజు, పంచాయతీ కార్యదర్శి రాయుడు మోహన్, వెల్ఫేర్ అసిస్టెంట్ పాలిక శ్రీరామలక్ష్మి, కొండాయపాలెపు నాగేశ్వరరావు, సామాని రాంబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న దృశ్యం

# నేరాలు ఘోరాలు

## కోడి పందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని సాగిపాడు గ్రామ శివారులో రహస్యంగా కోడి పందేలు నిర్వహిస్తుండగా ఎస్ఐ కె.రామకృష్ణ తన సిబ్బందితో దాడి నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఒక కోడి, ఒక కోడికత్తి, రూ.9,230 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారిపై కోసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

## వేతనాల చెల్లింపులో తీవ్ర జాప్యం

ప్రజాశక్తి -సామర్లకోట

కాకినాడ జిల్లా వ్యాప్తంగా సబ్ స్టేషన్లలో ఔట్సోర్సింగ్‌లో పనిచేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లు వేతనాలను ఇస్రో ఖాతాల ద్వారా చెల్లింపులో కాంట్రాక్టర్లు తీవ్ర జాప్యం చేస్తున్నారు. ప్రతి నెలా కార్మికులకు రావలసిన వేతనాలు కాంట్రాక్టర్ల నుండి సరైన సమయాల్లో వెయ్యటం లేదని ఉద్దేశంతో ఎపి ఇపిడిసిఎల్ ఉన్నత అధికారులు షిఫ్ట్ ఆపరేటర్లకు ఇస్రో ఖాతాల ద్వారా వేతనాలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. కాంట్రాక్టర్లు ఇందులో తీవ్ర జాప్యం చేయడంతో నేటికీ ఇస్రో ఖాతాలను కూడా ప్రారంభించలేదు. ఇస్రో ఖాతాల ద్వారా ఏరోజైతే విద్యుత్ శాఖ అధికారులు కాంట్రాక్టర్ అకౌంట్లో జమ చేశారో అదే రోజు కాంట్రాక్టర్లు ఇఎస్ఐ, పిఎఫ్‌లను కార్మికుని వేతనం ఒకేసారి జమవుతుందని దీనివల్ల కార్మికుల వేతనాలు వేయడంలో జాప్యం జరగకుండా ఉంటుందన్నారు. ప్రతి నెలా ఒకటో తారీఖున వేతనాలు వస్తాయని సబ్ స్టేషన్ లో పనిచేసే షిఫ్ట్ ఆపరేటర్లు అనుకున్నారు. కాంట్రాక్టర్లు చేసిన నిర్లక్ష్యం వల్ల నేటికీ కూడా ఇస్రో ఖాతాలే ప్రారంభించలేదు. దీనితో కాకినాడ జిల్లా పరిధిలోని సుమారు 1500 మంది షిఫ్ట్ ఆపరేటర్లు నష్టపోతున్నారు. అధికారులు స్పందించి కాంట్రాక్టర్లతో సబ్ స్టేషన్లో పనిచేసే షిఫ్ట్ ఆపరేటర్లందరికి ఇస్రో ఖాతాలను ప్రారంభించి ప్రతినెల ఒకటో తేదీన జీతాలు పడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రోహిత్ పుట్టిన రోజు వేడుకల్లో అభిమానులు

## ఘనంగా ఐవి.రోహిత్ పుట్టినరోజు

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవి.రోహిత్ పుట్టినరోజు వేడుకలను అన్నవరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక శాంతి వర్ధన వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో చిన్నారుల సమక్షంలో చైర్మన్ ఐవి.రోహిత్ అభిమానులు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ అభిమానులు అత్తి సత్తిబాబు, వీర్ల సూరిబాబు, దారా వెంకటరమణ, కెఎల్‌టిసి.బాబూరావు, పిన.సతీష్, కె.గణేష్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సత్తిబాబు తదితరులు

## కల్తీ మాంసం విక్రాయాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -గోకవరం

కల్తీ మాంసం విక్రయాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గోకవరం సొసైటీ అధ్యక్షులు గాజింగం సత్తిబాబు అన్నారు. ఆదివారం సత్తిబాబు ఆధ్వర్యంలో రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ కల్తీ మాంసం విక్రయాలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అయినా ఎటువంటి స్పందన లేదన్నారు. దీంతో వినియోగదారులతో కలిసి ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించామన్నారు. కల్తీ మాంసం కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. వ్యాధులు సోకిన, చచ్చిన మేకలు, ఆవు మాంసాన్ని వ్యాపారులు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## గృహ సారథుల మండల కన్వీనర్‌గా వెంకటసతీష్

ప్రజాశక్తి- దేవరపల్లి

వైసిపి గృహసారథుల మండల కన్వీనర్‌గా త్యాజంపూడి ఉపసర్పంచ్, వైసిపి సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ కుసులూరి వెంకటసతీష్ నియమితులయ్యారు. శనివారం దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో గోపాలపురం ఎంఎల్ఎ తలారి వెంకట్రావు ఈ విషయాన్ని ప్రకటించారు. వెంటకసతీష్ మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకంతో ఉంచిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని తెలిపారు.

## 'ఉపాధి' పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

దమ్మెన్నులో ఆదివారం ఉపాధి హామీ చట్టంలో భాగంగా పనులను ప్రారంభించామని ఎంపిడిఒ ఎ.శ్రీనివాస్ తెలిపారు. పంచాయతీ ఊర చెరువు పూడికతీత పనులను సర్పంచ్ గురజర్ల వీర వెంకట సత్యనారాయణ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. సుమారు రూ 9 లక్షలు అంచనాతో 3,500 పనిదినాలతో ఈ పనులు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. కార్యక్రమంలో సాంకేతిక సహాయ కుడు గొల్లపల్లి కాంతారావు, సిబ్బంది పాల్గొన్నారు.

## టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి-కొత్తపేట

ఆలమూరు మండలం మూలస్థానం గ్రామం నుంచి పలువురు జనసేన నుంచి టిడిపిలో చేరారు. ఆదివారం వాడపాలెం టిడిపి కార్యాలయం వద్ద నియోజకవర్గ పార్టీ ఇంఛార్జ్ బండారు సత్యానందరావు సమక్షంలో టిడిపిలో చేరిన వారికి సత్యానందరావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు

# యానాం వార్తలు



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు, సిఐటియు నాయకులు

## కార్మికుని కుటుంబానికి అండగా సిఐటియు

ప్రజాశక్తి - యానాం

యానాం దరియాలతిప్పలోని శ్రీ గాయత్రీ రైస్ మిల్లులో విధులు నిర్వహిస్తూ మతి చెందిన కార్మికుడు జగన్నాథరావుకు న్యాయం చేయాలంటూ ఆదివారం ఆందోళన చేపట్టారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం రైస్ మిల్ గేటు వద్ద దరియాలతిప్ప గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. రైస్ మిల్ యాజమాన్యం దిగివచ్చి సిఐటియు నాయకులు, గ్రామస్తులు,పోలీస్ సిబ్బందితో చర్చలు జరిపారు. అనంతరం మతి చెందిన జగన్నాథరావు కుటుంబానికి న్యాయం చేస్తామని రైస్ మిల్ యాజమాన్యం తెలిపింది. ఎస్ఐ శేరు నూకరాజు యాజమాన్యంతో ఒప్పంద పత్రాన్ని రాయించారు.



వార్షికోత్సవానికి హాజరైన ప్రముఖులు

## ఘనంగా 'శ్రీ వేద' వార్షికోత్సవం

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో స్థానిక గోపాల్ నగర్‌లో ఉన్న శ్రీ వేద పబ్లిక్ స్కూల్ మొదటి వార్షికోత్సవం చైర్మన్ గుత్తుల గోవింద జయరామారావు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్, గూటం శివ గణేష్, దాట్ల దేవదానం రాజు, బొల్లోజు బాబా, దంగేటి త్రిమూర్తులు, మట్టపర్తి లోవరాజు తదితరులు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. చిన్నారులచే వివిధ సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించి ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు అర్జున్, నీతూ హరి, ప్రిన్సిపల్ ఎస్.అనుపమ, డివివి సత్యనారాయణ, నిమ్మకాయల శ్రీను, బంగారం, గుత్తుల నందు తదితరులు పాల్గొన్నారు.

## సూర్య పోలి క్లినిక్ ఆధ్వర్యంలో నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - యానాం

యానాం పైడికొండల వారి వీధిలో ఉన్న సూర్య పోలి క్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కపిలేశ్వరం నేత్ర వైద్య విజ్ఞాన సదస్సు ఎల్‌వి ప్రసాద్ అధ్యక్షతన ఉచిత మెగా స్పెషాలిటీ మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి పేదవారికి ఉచితంగా కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు. మొత్తం 187 మంది కంటికి సంబందించిన రోగులు హాజరయ్యారని,47 మందికి ఉచితంగా కాంట్రాక్టు సర్జరీలు చేయనునట్లు సూర్య పోలి క్లినిక్ యాజమాన్యం తెలిపింది.

## 8,9 తేదీల్లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - కాట్రేనికోన

'స్టెప్' జాతీయ సమితి ఆధ్వర్యం లో వ్యక్తిత్వ వికాస నిపుణులు, సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు నాయకత్వం లో విజయవాడలో ఏప్రిల్ 8, 9 తేదీలలో రెండు రోజులు ఉచిత వక్త శిక్షణ ఇస్తారని స్టెప్ రాష్ట్ర సమితి సభ్యులు విత్తనాల వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్లో, యువకుల్లో ఉన్న విద్యార్థుల అంతర్గత శక్తి సామర్థ్యాలను వెలికితీసి, ఆత్మ విశ్వాసం నింపి మంచి సమాజం నిర్మించాలనే లక్ష్యంతో శిక్షణ ఏర్పాటు చేశారన్నారు. పలు అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు. ఈ శిక్షణ తరగతులకు ఉచితంగా హాజరయ్యే అవకాశం ఉందని మంచి వక్తలుగా మారాలని కోరుకునేవారు ఆసక్తి వున్నవారు తమ పేర్లను 90306 44440 నంబర్‌కు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలన్నారు.